# కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- చెప్పినవి చెప్పినట్లు చేసేది బీఆర్ఎస్ మాత్రమే..
- బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- నందిపేట్ మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, నవంబర్ 17: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెప్పినవి చెప్పినట్లు చేస్తున్న బీఆర్ఎస్‌ను నమ్ముదామా? కొత్త కథలు చెబుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్ముదామా? అన్నది ఆలోచించాలని కోరారు. ఆ రెండు పార్టీలు ప్రజల సంక్షేమాన్ని ఎప్పుడూ ఆలోచించవని విమర్శించారు. నిత్యం ప్రజల బాగు కోసం ఆలోచించే సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. నందిపేట్ మండలంలో శుక్రవారం నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డితో కలిసి కవిత పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కొంత మందికే రూ.200 పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడు ఊరిలో అర్హులందరికీ రూ.2వేల పింఛన్‌ను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని వివరించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆ మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచాలని, ఐదేండ్లలో వాటిని రూ.5 వేలకు పెంచుకుంటూ వెళ్లాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛన్లు అందిస్తామని ప్రకటించారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో సకాలంలో ఎప్పుడూ ఎరువులు అందించలేదని, సాగు, తాగునీళ్లు ఇవ్వలేదని అలాంటి పార్టీ మనకు అవసరమా అన్నది ఆలోచించాలని కోరారు. ఎలాంటి ఆధారం లేని పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పేరిట నెలకు రూ.3వేల పింఛన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని వివరించారు. ఆర్థిక భారం తగ్గించాలన్న ఉద్దేశంతో రూ.1200గా ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే సబ్సిడీ కింద ఇస్తామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**నా గెలుపు ఖాయం.. కాంగ్రెస్, బీజేపీలు మాయం..**

ఆర్మూర్‌లో తన గెలుపు ఖాయమని, కాంగ్రెస్, బీజేపీలు మాయం కాక తప్పదని బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో కారుగుర్తు మొదటి నంబర్‌లో ఉన్నదని, ఒకటో నంబర్ ముద్దు ..ఇంకోనంబర్ వద్దని జీవన్‌రెడ్డి అన్నారు. మున్నూరు కాపులు అసలు సిసలైన రైతు బిడ్డలు అని, ఇది పక్కా రైతు ప్రభుత్వమని, ప్రతి పథకం మున్నూరు కాపుల ఇంటి ముంగిట్లోకే వస్తున్నదన్నారు. ఎన్నికల్లో తనకు ఓటు వేసి దీవించాలని జీవన్‌రెడ్డి కోరారు.


నందిపేట మండలంలో నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు

# గల్ఫ్ కార్మికులకు బీమాపై హర్షం

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

వేల్పూర్, నవంబర్ 17: అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ కార్మికులకు రూ.5లక్షల బీమా కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. గల్ఫ్ నుంచి సెలవుపై వచ్చిన పలువురు కార్మికులు శుక్రవారం వేల్పూర్ మండలం వాడీ, పచ్చలనడ్కుడ గ్రామాల్లో సీఎం కేసీఆర్, మంత్రి వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు, వాడీ, పచ్చలనడ్కుడ సర్పంచులు మహేశ్, గంగారెడ్డి, గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు. గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబసభ్యులు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోటపాటి కోరారు.


వాడీ గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గల్ఫ్ కార్మికులు

# నేడు మంత్రి హరీశ్‌రావు రోడ్ షో


సాటాపూర్‌లో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్

నందిపేట్/మాక్లూర్/ రెంజల్, నవంబర్ 17: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. రెంజల్ మండలం సాటాపూర్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి పాల్గొననున్నారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేటలో నిర్వహించే రోడ్‌షోలో హరీశ్‌రావు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం మాక్లూర్ మండలం మానిక్‌బండార్ గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రచారసభకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత హాజరుకానున్నారు. మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో బోధన్, రెంజల్, నవీపేట, నందిపేట, మాక్లూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు పూర్తి చేశారు.




నిజామాబాద్ నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సతీమణి లత, సోదరీమణులు రాణి,వాణి, బీఆర్ఎస్ మహిళా నాయకులు


నవీపేటలో ప్రచారం చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా


ఆర్మూర్ పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి

# ప్రచారంలో ఫ్యామిలీ

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున కుటుంబ సభ్యులు సైతం ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో బిగాల, షకీల్, జీవన్‌రెడ్డి పోటీ చేస్తుండగా వారి సతీమణులు లత, ఆయేషా ఫాతిమా, రజితారెడ్డి ఇంటింటికీ వెళ్లి గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

- నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 17


కామారెడ్డిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి